# దర్గామిట్ట కతలు




## మా అన్నేగాని చదివుంటే...

...నాయినా... ఈ పాటికి మా పరిస్థితి కీసరభా అంటా ఉండేది. వాడితో పాటు సరి సమానంగా బాద్యతలు పంచుకోవాల్సిన నేను ఏం చేయాలో తెలియక 'జజ్జనకా' అని డాన్సాడతా ఉండేవాణ్ణి. ఇంటి కాణ్ణుంచి మా అమ్మ వారానికోతడవైనా 'నా బట్టారే... జరుగుబాటు కష్టంగా ఉంది. నెలకి రొండు వేలన్నా పంపించరా' అని హైదరాబాద్‌కి జాబుల మీద జాబులు రాయించి నన్ను సంపకమాకుండేది.

నా టైము బాగుంది.

మా అన్న నన్ను రక్షించినాడు.

వాడు చదువుకోకుండా దయతో నన్ను కాపాడినాడు.

నల్లగా మబ్బులు కమ్మిన ఒక సందేళ మా అన్నని పొర్లించి పొర్లించి తంతా యింటికి తీసకొచ్చి పడేసినాడు మా నాయిన.

వాణ్ణి చూసి మా అమ్మ బిత్తరపోయింది.

మా నాయినమ్మ లబలబమని నోరుకొట్టుకుంది.

'పసిబిడ్డని కొట్టి చంపేస్తామిరా మాదర్చోదా. నొదులట్టా' అని, మా అన్నని గబాల్న జవురుకుంది.

అప్పటికే వాడి ఒళ్లంతా బురదతో నిండిపొయ్యింది. ఆడాడ చర్మం చీరుకొని పొయ్యింది. మా నాయిన కొట్టిన దెబ్బలకి వాంవూపాల నలిగిపోయున్నాడు.

వాడి హాలతు చూసి మా అమ్మ కళ్లనిండుగా నీళ్లు బెట్టుకుంటే మా నాయినమ్మ శాపనార్థాలకు తగులుకొంది.

'నీ చేతులిరగ. నీ అరిచేతుల్లో పుండుబడ. కోపమొచ్చిదంటే మనిషి జన్మ ఎత్తిన సంగతి కూడా మర్చిపోతావేమిరా ముండబాడకోవా' అని మా అమ్మతో పాటు వలవలమని ఏడ్చింది.

వాళ్లిద్దరి ఏడుపు చూసి మా నాయిన చల్లగ చల్లారిపోయినాడు. సిగరెట్టు వెలిగించుకొని గమ్మున మంచం మీద కూచున్నాడు.

కాసేపు తాలినాక 'వాడికి ఏణ్ణీళ్లు బోసి గుడ్డలు మార్చు' అన్నాడు.

మా నాయినమ్మ గబగబా లేచి, చెర్వులోని ఏణ్ణీళ్లతో మా అన్నకు స్నానం చేయించి, నడుముకు తువాలు కడతా వుంటే ఆయింట్‌మెంటు తీసకొని వాడికాడికొచ్చాడు మా నాయిన.

మా నాయినమ్మ మా అన్నని ఒదిలేసింది.

వాడు బయం బయంగా చూశాడు మా నాయిన తట్టు.

మా నాయిన మళ్లా కోపగించుకోకుండా, వాడికి దెబ్బలు తగిలినకాడ ఆయింటుమెంటు రాస్తా మెత్తగా మాట్లాడినాడు.

'ఇస్కూలొదిలినాక గమ్మున ఇంటికొచ్చెయ్యాలిగానీ నీకా తంబల గుంట (మా ఊరి శివాలయయం పక్కనే ఉండే పెద్ద నీటి గుంటిది. దీని ఎదురుగ్గానే మా అన్న చదివే జెడ్‌పీస్కూలు) కాడ ఏంపని? వాన్నీళ్లు ఆ వాటాన తూములోంచి దూకతా ఉంటే చేపలు పట్టడానికి మోకాలు లోతుకి దిగినావే... కాలుగానీ జారితే?

చదువు కోరా నాయినా అంటే నీకియ్యేం పనులురా? నాలగక్షరాలు రాకపోతే నాలా బొక్కలు కొట్టే దానికి(వైరింగుపని) కూడా పనికి రావురా' అన్నాడు.

మా అన్న నోరెత్తలా.

అప్పణ్ణే గాదు ఆ తర్వాత చాలా మార్లు కూడా నోరెత్తేవాడు కాదు మా అన్న.

స్కూలెగమాకడం, సినిమాలకెళ్లడం, బలాదూరు తిరగడం, మా నాయిన కంటబడటం, కుంగా తన్నులు తినడం... యిదీ వాడి డ్యూటీ!

తొలి కొడుకు గాబట్టి వాణ్ణి చదివించడానికి ఏందేందో చేశాడు మా నాయిన. యాడాణ్ణో పర్‌వేట్‌లకు ఒదిలి బెట్టినాడు. ఎట్టట్నో నంజాయించి చెప్పబోయినాడు.

మా అన్న వింటేగా!

ఎనిమిదో క్లాసుకొచ్చే తలికి ఎదురు తిరిగేసినాడు.

'నేను ఇస్కూలుకు పోనుపో, పని నేర్చుకుంటా' అని మా నాయినకే జవాబు చెప్పేటంతటోడయినాడు.

వాడి ఎదురు జవాబులు చూసి ఈ పారి మా అమ్మ సావగొట్టేసింది,'ఇస్కూలుకు పోతావా? పోవా?' అని.

మా నాయినమ్మయితే 'ఆ మంజాను, మస్తాను, ఖలందరు పురుగులు పడిపోను. వాళ్లని మట్టిలో పెట్టి కప్పెట్టా. బంగారంలాంటి పిల్లోణ్ణి ఏమి చేసి పెట్టారమ్మా' అని మా అన్న స్నేయితుల మీద తిట్లకు దిగింది. మా అన్నకు చదువురాక పోవడానికి ఆ ముగ్గురే కారణమని మా నాయినమ్మ నమ్మకం.

మా అన్న వాటం చూసీ చూసీ యింకిట్టగాదని ఒక రోజు సుత్తీ శావం చేతికిచ్చి వాణ్ణి కరెంటు పనిలో దించేసినాడు మా నాయిన. రోజూ వాణ్ణి తోడు తీసకెళ్లడం, బొక్కలు కొట్టించడం,వాడి చేత వైరింగు పని చేయించడం మొదలుబెట్టినాడు – అట్టయినా వాడు దారికొస్తాడేమోనని...

(మిగతా పక్కపేజీలో)

(దర్గామిట్ట కత తరువాయి...)

కానీ వాడెట్టాంటోడా?

నాలుగేళ్లకే పనిలో పండి వగిల్నోడి మాదిరిగా వైరింగు మొదలుబెట్టినాడు. దాంతో ఏ పనైతే వగోడికి కూడా వద్దనుకున్నాడో ఆ పనే మా అన్నకు నేర్పించి కొన్నాళ్లకు వాడి మీద ఆధారపడి పోయినాడు మా నాయిన.

మా అన్నకు పద్దెనిమిదేళ్లు వచ్చినప్పట్నుంచి మా నాయిన పనిచేసిందేమీలా. మా అన్నకు మందల (పని వివరం) చెప్పేసి రావడం, మా అన్న ఆ ప్రకారం పని చేసి సాయింత్రానికి డబ్బులు దేవడం... దాంతో ఇల్లు నడిపించడం...ఇదీ ఆయన చేసిన గనకార్యం.!

ఎవరన్నా మా అన్న పనితీరును పొగడ్తా మాట్లా డితే 'మా వాళ్ల పిలకాయలకు చదువొచ్చేదుందా? వచ్చినా సర్కారు ఉద్య తినే బాగ్యముందా? ఏదో యిట్టాంటి పని నేర్పిస్తే బతికేయబోతాడు గదా అని వాణ్ణి నా చేతికిందకి తీసుకున్నాను భాయ్' అనేవాడు మా నాయిన.

చిన్నప్పట్నించి మా అన్న పని చేసి, రెక్కలు ముక్కలు గొట్టాడు గాబట్టి సరిపోయిందిగానీ లాకపోతేనా కంప్యూటర్ బియస్సీ అని నేనూ, ప్రాదమికా యిశారదా అని మా చెల్లెలూ, రెసిడెన్షి యల్ ఇస్కూల్ అని మా తమ్ముడు వేలకు వేలు గుంజతా ఉంటే చెల్లించడం మా నాయిన వల్ల అయ్యే పనేనా? మేము చదివేది నిజమేనా?

ఒక సారి యిప్పటికిప్పుడు వెయ్యి రూపాయలు టరమ్ ఫీజుకు కావాలని, యియ్యాలే లాస్టు డేటని, కట్టకుంటే పరీక్షలు రాయనీయరనీ నేను పెడ్రానికి దిగితే ఏం చేయాలో పాలుబోక మా నాయిన కిందా మీదా అయిపోయినాడు.


అప్పుడు మా అన్నే యాడికో బోయి, ఏవో మోటార్లు అర్జెంటుగా బిగించి, సాయింత్రానికి ఒళ్లంతా ఆయిల్ మరకలు చేసుకుని, జేబువిం దుగా డబ్బులు బెట్టుకొని ఇంటికొచ్చాడు.

ఆ డబ్బులు నా చేతిలో పెడతా 'మన్సూర్ కూడా నీ మాదిరే యిట్టాంటి పనికిమాలిన చదువులు చదివుంటే మనం ఏనాడో బొచ్చెత్తు కుపోయుండే వాళ్లంరా నాయినా! దాన్ని మన సులో బెట్టుకుని చదవరా అయ్యా' అన్నాడు మా నాయిన.

ఈ కత మా అక్బరుకు చెప్తే 'చదువుకున్నావన్న మాటేగానీ యీ నాటికీ మా యింట్లో జరుగు బాటు మా అన్నదే గదా.యీ లెక్కన మా అన్న మాకు దేముడుగదా' అనంటే 'మీ ఇంట్లో నేనా దేముడు నాయినా? మా ఇంట్లో లేడా? మనోళ్ల ఇళ్లల్లో ఇంటికొకడులేడా?' అన్నాడు నాకు తోడుబోతా.

—మహమ్మద్ ఖదీర్‌బాబు

# అమర్ ఫలం



అలంకరణకు ఉపయోగపడే మొక్కలు తినేందుకు పనికి వచ్చే ఫలాల నివ్వట మంటే, కొంత వింతగా అనిపించినా అది వాస్తవమే. చిత్రంలో కనిపించే మొక్క అలంకరణకు ఉపయోగించే ఒక మొక్క. దీనిని వృక్ష శాస్త్ర పరంగా 'మొనొస్టేరియా డెలికోసా'గా అంటారు. హిందీలో అమర్ ఫల్ అంటారు. ఈ మొక్కను కుంపటి లోనైనా, నేలలో నైనా పెంచవచ్చు.

ఈ డెకరేటివ్ మొక్కను ఒక చెట్టు పైకి పాకిస్తే అది పరాన్ని జీవిగా బాగా పెరిగిపోయి, ఏడాదికి ఒక సారి, నాలుగు లేక ఐదు ఫలాల నిస్తుంది. చిత్రంలో కనిపిస్తున్న ఈ మొక్క ఆకులు తామర ఆకుల కన్నా పెద్దవిగా, వింత వింత రంధ్రాలతో కత్తిరించినట్లుగా ఉండి చూసేందుకు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.దీని నుంచి వచ్చే పండ్లు పెద్ద సైజు అరటి పండు పరిమాణంలో ఉండి మొక్కజొన్న కంకుల ఆకారంలో,అ నాస, సీతాఫలాల రుచుల కలయికతో చాలా మధురంగా ఉంటాయి. సీతా రాములు వన వాసం చేసినప్పుడు ఇతర కందమూలాలతో పాటు అడవులలో స్వాభావికంగా లభించే ఈ పండ్లను కూడా ఆరగించేవారని పురాణాల వల్ల వెల్లడవుతోంది.

—ఆవుల రామ్మోహన్ రెడ్డి



